# నీటి సంరక్షణ అందరి బాధ్యత

- జాతీయ జల మిషన్ డైరెక్టర్ అర్చన వర్మ

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

నీటి వనరుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జాతీయ జల మిషన్ డైరెక్టర్ అర్చన వర్మ తెలిపారు. సోమవారం జాతీయస్థాయి 51వ వెబినార్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జమ్మూ కాశ్మీర్‌లోని రాజౌరి జిల్లా కలెక్టర్ అభిషేక్, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ లతో కలిసి జలసంచాయి జన భగీదారి కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చన వర్మ మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా జల సంరక్షణ కార్యక్రమాలు విజయవంతంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో చేపట్టిన జలసంచాయి జన భగీదారి కార్యక్రమం ద్వారా నీటి వనరుల పరిరక్షణలో గణనీయమైన పురోగతి సాధించామన్నారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసినందుకు మంచిర్యాల జిల్లా 2 కోట్ల రూపాయల ప్రోత్సాహక అవార్డుకు అర్హత సాధించిందని తెలిపారు. జిల్లా






కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ... జిల్లాలోని 18 మండలాలలో 16 గ్రామీణ, 2 పట్టణ మండలాలు ఉన్నాయని వివరించారు. జిల్లాలో సింగరేణి కాలరీస్, ఓరియంట్ సిమెంట్, ఇసుక మైనింగ్ కార్యకలాపాల కారణంగా నీటి అవసరం ఎక్కువగా ఉందని చెప్పారు. వ్యక్తిగత, సామూహిక ఇంకుడు గుంతల ద్వారా నీటి నిల్వలు పెరిగాయని తెలిపారు. గత సంవత్సరం 43,545 వ్యక్తిగత ఇంకుడు గుంతలు, 5,372 సామూహిక గుంతలు ఏర్పాటు చేయడంతో భూగర్భ జలాల స్థాయి పెరిగిందని వివరించారు. అటవీ పరిసర ప్రాంతాలలో బౌండరీ ట్రెంచ్‌లు ఏర్పాటు చేయడం ద్వారా వర్షాకాలంలో నీటి నిల్వతో పాటు అటవీ జంతువుల రక్షణ సాధ్యమైందని తెలిపారు. చెక్‌డ్యామ్‌లు, వృక్షారోపణ ద్వారా భూగర్భ నీటి స్థాయి మెరుగుపడిందన్నారు. ప్రతి ఇంటికి ఆరు మొక్కల చొప్పున పంపిణీ చేసి గత మూడు సంవత్సరాల్లో 45 లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. వరి, పత్తి పంటల సాగు విస్తీర్ణం, దిగుబడులు పెరిగాయని, భూగర్భ జల నాణ్యత కూడా మెరుగుపడిందని చెప్పారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో అవగాహన సమావేశాలు నిర్వహించడం ద్వారా నీటి సంరక్షణపై ప్రజల్లో చైతన్యం పెరిగిందని వివరించారు. జల మిషన్ డైరెక్టర్ అర్చన వర్మ మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా నీటి సంరక్షణ కార్యక్రమాల్లో మంచిర్యాల జిల్లాను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. వెబినార్‌లో పాల్గొన్న విద్యార్థుల ప్రశ్నలకు సమాధానమిస్తూ, వారి అవగాహన అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ కిషన్, విద్యాశాఖ సమన్వయకర్తలు చౌదరి, సత్యనారా యణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భారత న్యాయవ్యవస్థకు చీకటి దినం

- న్యాయవాది లింగాల సురేష్

**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

సుప్రీంకోర్టులో సోమవారం భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్‌పై ఒక న్యాయవాది దాడి యత్నం జరగడం అత్యంత దారుణమని, చట్టవ్యవస్థ పట్ల అవమానకరమని యువ న్యాయవాది లింగాల సురేష్ తెలిపారు. భారత న్యాయవ్యవస్థ దేశ ప్రజాస్వామ్యానికి ఆధారం అని, న్యాయమూర్తులపై దాడి ప్రయత్నం కేవలం వ్యక్తిగత దాడి కాకుండా మొత్తం న్యాయవ్యవస్థపైనే దాడి అని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి ప్రవర్తనపై కఠిన చర్యలు తీసుకుని న్యాయవ్యవస్థ గౌరవం, పరిపాలనా ప్రతిష్టను కాపాడాలని డిమాండ్ చేశారు. గవాయ్ ప్రదర్శించిన స్థైర్యం, సమతుల్యత న్యాయమూర్తి ధర్మానికి నిజమైన ప్రతీకగా నిలిచిందని సురేష్ అన్నారు. "ఇలాంటివి నన్ను ప్రభావితం చేయవు" అన్న గవాయ్ వ్యా ఖ్యలు ప్రతి న్యాయవాదికి స్ఫూర్తినిస్తాయని తెలిపారు. న్యా యమూర్తులపై దాడి అంటే న్యాయంపై దాడి, న్యాయంపై దాడి అంటే ప్రజాస్వామ్యంపై దాడి అని వ్యాఖ్యానించారు. ఇలాంటి సంఘటనలను న్యాయవాద సమాజం తీవ్రంగా ఖండిస్తు న్నదని, దాడికి పాల్పడిన న్యాయవాదిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అతని న్యాయపట్టాను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

శంకరపట్నం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్/కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులకు (గంటల ప్రాతిపదికన) అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కే ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీటీ తెలుగు, ఇంగ్లీష్, ఎకనామిక్స్ విభాగాల్లో అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పీజీ, బీ.ఎడ్ అర్హతలు కలిగిన అభ్యర్థులు సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లు, బయోడేటాతో కలిసి ఈ నెల 9న ఉదయం పాఠశాలలో నిర్వహించే డెమో, ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.

## ఉర్దూ ఉపాధ్యాయ అవార్డులకు ..

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ అవార్డు కోసం అర్హులైన ఉపాధ్యాయుల నుండి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి తెలిపారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయ భవన సముదాయంలోని రూమ్ నం.5లో గల జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. నిబంధనలు, షరతులకు లోబడి ఈ దరఖాస్తులను ఉచితంగా పొందవచ్చని చెప్పారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 14వ తేదీలోగా జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8555841417 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**శెనార్తి మీడియా, మానకొండూర్:** మానకొండూర్ మండలం జగ్గయ్యపల్లి గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. వరిగడ్డి లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో మోటార్‌సైకిల్ అదుపుతప్పి ప్రమాదం సంభవించింది. జగ్గయ్యపల్లి గ్రామానికి చెందిన రామగిరి రాకేష్ (28), నరేష్ (25) ఇద్దరూ మోటార్‌సైకిల్‌పై అన్నారం వైపు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. ప్రమాదంలో రాకేష్ కుడికాలు ట్రాక్టర్ కిందపడి తీవ్రంగా నుజ్జునుజ్జయింది. నరేష్ స్వల్ప గాయాలతో తప్పించుకున్నాడు. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా, ఈఎంటి గూడూరు సతీష్ రెడ్డి, పైలట్ బి. రెడ్డి శ్రీనివాస్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## బైక్ ఈఎంఐ కట్టలేక యువకుడి ఆత్మహత్య

**శెనార్తి మీడియా, శంకరపట్నం :** మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన కటికిరెడ్డి సుమంత్ (24) బైక్ ఈఎంఐ చెల్లించలేక క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు.ఈ నెల 5న ఉదయం 11 గంటల సమయంలో తన పొలం వద్ద మద్యంమత్తులో గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమచించి సోమవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో సుమంత్ మృతి చెందాడు. సుమంత్ మద్యానికి బానిస కావడంతో అప్పులు పెరిగాయి. బైక్ ఈఎంఐ కట్టలేక బలవన్మరణానికి పాల్పడ్డాడని పెద్దనాన్న కటికిరెడ్డి సంపత్ ఫిర్యాదులో తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు కేశవపట్నం ఎస్ఐ శేఖర్ రెడ్డి తెలిపారు.

## ప్రతి పౌరునికి నివాసం కల్పించాలి

**శెనార్తి మీడియా, మంచిర్యాల :** ప్రతి పౌరునికి సొంత ఇంటి సౌకర్యం కల్పించడం ప్రభు త్వాల మౌలిక బాధ్యత అని తెలంగాణ బలహీన వర్గాల సంక్షే మ సంఘం అధ్యక్షులు, అడ్వకేట్ రాజలింగు మోతె పేర్కొ న్నారు. ప్రపంచ నివాస దినోత్సవం సందర్భంగా పట్టణం లోని మార్కెట్ ఏరియాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... పౌరుల సంక్షేమం పట్ల ప్రభుత్వాలు మరింత కట్టుబడి ఉండాలని అన్నారు. అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, భవనాలు కాదని, ప్రతి కుటుంబానికి మచ్చిక ఇల్లు కల్పిం చడం ద్వారానే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని తెలి పారు. పేదల గృహ అవసరాలను తీర్చడానికి హౌసింగ్ పథకా లు, రుణ సబ్సిడీలు, తక్కువ ధరల ప్లాట్లు, ఉచిత గృహ నిర్మాణాలు వంటి చర్యలు ప్రభుత్వాలు తీసుకోవాలని డిమాం డ్ చేశారు. ప్రతి పౌరునికి సొంత గృహం కల్పించడం ప్రభుత్వాల కర్తవ్యమే కాకుండా నైతిక బాధ్యత కూడా అని రాజ లింగు మోతె స్పష్టం చేశారు. పౌరుల కలల గృహం సాకారం దిశగా ప్రభుత్వం తొలి అడుగు వేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీబీఎస్ఎస్ నాయకులు గోమాస శ్రీనివాస్, లింగంపల్లి అభిలాష్ పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో
# సెయింట్ జార్జ్ విద్యార్థి ప్రతిభ

**శెనార్తి మీడియా, కరీంనగర్ :**




కొత్తపల్లి పట్టణంలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ స్టూడెంట్ కె.అద్వికానాథ్ ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించినట్లు స్కూల్ చైర్మన్ పి.ఫాతిమారెడ్డి తెలిపారు. 10 సంవత్సరాల 10 నెలల పది రోజుల వయస్సుతో 1 నుంచి 50 అంకెల క్యూబ్ నెంబర్లు 1.52 నిమిషాల్లో చెప్పి, తక్కువ సమయంలో టార్గెట్ పూర్తిచేసిన ఘనత సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం అద్వికానాథ్‌ను మెడల్, సర్టిఫికెట్‌తో సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నిరంజన్ పాల్గొన్నారు.

# అనువైన చోటే బ్రిడ్జి నిర్మాణం



- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

**శెనార్తి మీడియా, గన్నేరువరం:**

గన్నేరువరం మండలం నుంచి కరీంనగర్ జిల్లా కేంద్రానికి చేరుకునేందుకు మానేరు డ్యాం పై బ్రిడ్జి నిర్మాణాన్ని మండల ప్రజలకు అనువుగా ఉండే స్థలంలో చేపడతామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన మండలంలోని మైలారం, యస్వాడ గ్రామాల్లో పర్యటించారు. బ్రిడ్జి నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణంపై ఆందోళన చెందవద్దని, ప్రజలందరికీ సౌకర్యంగా ఉండే ప్రదేశంలోనే నిర్మాణం చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముసుకు ఉపేందర్ రెడ్డి, నాయకులు అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, కొమ్ము రవీందర్ రెడ్డి, బ్రిడ్జి జేఏసీ చైర్మన్ సంపత్ ఉదయ్ కుమార్, మైలారం, యస్వాడ, గన్నేరువరం గ్రామాల ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

# కోల్డ్ రిఫ్ సిరప్ వినియోగం నిషేధం

- జిల్లా వైద్యాధికారి అనిత

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**



జిల్లాలో చిన్నపిల్లల దగ్గు నివారణకు ఉపయోగించే కోల్డ్ రిఫ్ సిరప్ వినియోగాన్ని వెంటనే నిలిపివేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత తెలిపారు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ మార్గదర్శకాల మేరకు, జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఈ నిషేధం అమలులోకి తెచ్చినట్లు తెలిపారు. జిల్లాలో ఈ సిరప్ నిల్వలు లేవని, అయితే ప్రైవేట్ ఆసుపత్రులు, ఫార్మాసిస్టులు, ఏజెన్సీల వద్ద నిల్వలు ఉన్నట్లయితే వెంటనే సమాచారం అందించాలని సూచించారు. తమిళనాడులోని కాంచీపురం జిల్లాకు చెందిన శ్రేసన్ ఫార్మా మే 2025లో తయారు చేసిన బ్యాచ్ నంబర్ ఎస్ఆర్-13 సిరప్ వాడిన చిన్నపిల్లలలో అనారోగ్య సమస్యలు తలెత్తడంతో, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో పిల్లల మరణాలకు కారణమైందని తేలడంతో ఈ సిరప్ పై నిషేధం విధించినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు, ఫార్మసీలు, వైద్యులు, పిల్లల వైద్యులు తమ వద్ద ఈ సిరప్ నిల్వలు లేకుండా చూడాలని, ఉన్నట్లయితే వెంటనే జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయానికి లేదా టోల్ ఫ్రీ నంబర్ 1800 599 6969 లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ఫార్మసీలు, హోల్ సేల్ వ్యాపారులు, ఆసుపత్రులు అప్రమత్తంగా ఉండాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు తమ పరిధిలోని ఫార్మసీల వద్ద సిరప్ వివరాలు సేకరించాలని ఆదేశించారు. రెండు సంవత్సరాల లోపు పిల్లలకు ఎలాంటి దగ్గు మందులు ఇవ్వకూడదని, వైద్యుల సూచన మేరకే మందులు వాడాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించే ఫార్మాసిస్టులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

మండలంలోని గూడెం, బెజ్జంకి, వడ్లూర్, బేగంపేట్ గ్రామాల్లో ఇటీవల పలువురు మృతి చెందగా, బాధిత కుటుంబాలను సోమవారం మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి మనోధైర్యం కల్పించారు. ఎమ్మెల్యే వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ చిలివేరి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య, గుడెల్లి శ్రీకాంత్, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, నాయకులు ఆయిలేని శ్రీనివాస్ రెడ్డి, ఇస్కిల్ల అయిలయ్య, నరసింహ చారి తదితరులు పాల్గొన్నారు.

## పత్తి విక్రయానికి కపాస్ కిసాన్ యాప్ తప్పనిసరి




- రైతులు వివరాలు నమోదు చేసుకోవాలి
- అదనపు కలెక్టర్ చంద్రయ్య

**శెనార్తి మీడియా, మంచిర్యాల :** జిల్లాలోని రైతులు పత్తిని విక్రయించేందుకు ప్రభుత్వం ప్రారంభించిన కపాస్ కిసాన్ యాప్లో తప్పనిసరిగా తమ వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య తెలిపారు. నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మా ట్లాడుతూ, 2025–26 సంవత్సరానికి సి.సి.ఐ. (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ద్వారా కనీస మద్దతు ధరపై పత్తి కొనుగోలు జరగనున్నట్లు తెలిపారు. రైతులు కపాస్ కిసాన్ యాప్ ద్వారా తమ వివరాలు నమోదు చేసుకుని స్లాట్ బుక్ చేసుకోవాలని ఆయన సూచించారు. ఆధార్ ధృవీకరణ పూర్తయిన తరువాతనే పత్తి కొనుగోలు జరుగుతుందని చెప్పారు. రైతులు తమ ఆధార్ కార్డులో వేలిముద్ర, కంటి స్కాన్, మొబైల్ నంబర్ నవీకరణ చేసుకోవాలని సూచించారు. చెల్లింపులు ఆధార్‌కు అనుసంధానమైన బ్యాంకు ఖాతాల్లోనే జమ అవుతాయని స్పష్టం చేశారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా నేరుగా సి.సి.ఐ. కేంద్రా ల్లోనే పత్తిని విక్రయించాలని సూచించారు. దళారులు కొనుగోలు చేసిన పత్తిని సి.సి.ఐ. కేంద్రాల్లోకి అనుమతించరాదని స్పష్టం చేశారు.

**మద్దతు ధరలు:**

**బీబీ బన్నీ/బ్రహ్మ రకం – ₹8,110 క్వింటాల్ కు**
**బీబీ ప్రత్యేక రకం – ₹8,060 క్వింటాల్ కు**
**మెక్ రకం – ₹8,010 క్వింటాల్ కు**

ఏఈఓలు గ్రామాల్లో తేమ శాతం, మద్దతు ధర, కొనుగోలు నిబంధనల వివరాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ఇతర రాష్ట్రాల నుండి పత్తి రాకుండా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సురేఖ, మార్కె టింగ్ అధికారులు షహబుద్దీన్, అశ్వక్ అహ్మద్, వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో అందుబాటులో యూరియా

## రైతులు అవసరం మేరకు వినియోగించుకోవాలి : కలెక్టర్ కుమార్ దీపక్



**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

జిల్లాలో పంట సాగుకు అవసరమైన యూరియా సమృద్ధిగా అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. రైతులు అవసరం మేరకు మాత్రమే యూరియా తీసుకొని వినియోగించుకోవాలని సూచించారు. సోమవారం నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయ భవన సముదాయంలోని తన ఛాంబర్‌లో జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, డివిజనల్ వ్యవసాయ అధికారులు, మండల వ్యవసాయ అధికారులతో యూరియా పంపిణీ నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... యూరియా సక్రమ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని, పంటలకు తగిన మోతాదులోనే ఎరువులు వాడేలా చైతన్యం కలిగించాలని సూచించారు. జిల్లాలో పంట సాగు నిరాటంకంగా సాగేందుకు అధికారులు రైతులకు అన్ని విధాలా సహకరించాలని చెప్పారు. రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, అర్హత గల ప్రతి రైతుకు పంట సాగుకు అవసరమైన యూరియా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.